నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 14 మార్చి 2025 | NALGONDA

కేటీఆర్‌ను కలిసిన దళిత సంఘం నాయకులు

నూతనకల్, మార్చి 13 : రాష్ట్ర బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను వివిధ మండలాల దళిత సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా రెండో విడుత దళిత బంధు నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేలా అంసెబ్లీలో ప్రస్తావించాలని వినతి పత్రం అందించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ ఎస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్‌కుమార్, రాము, నవీన్, వెంకట్, వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతి పత్రం అందిస్తున్న దళిత నాయకులు

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై ఆగ్రహ జ్వాల

- ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి నిరసన
- రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనం
- నేడూ ఆందోళనలకు సన్నద్ధం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

నల్లగొండలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, మార్చి13(నమస్తే తెలంగాణ) : గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం మీద చర్చలో భాగంగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తరపున మాట్లాడేందుకు సిద్ధమైన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై బడ్జెట్ సమావేశాల సెషన్ నుంచి సస్పెన్షన్ వేటు వేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రజల పక్షాన, రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీస్తే సస్పెండ్ చేస్తారా అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. టీవీలు, సామాజిక మాధ్యమాల్లో జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తీవ్రంగా స్పందించారు. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగారు. నల్లబ్యాడ్జీలు ధరించి నల్లజెండాలతో నిరసన తెలిపారు. రాస్తారోకోలతో ట్రాఫిక్‌ను స్తంభింపచేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం... దోపిడి రాజ్యం.. దొంగల రాజ్యం.. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మరోవైపు ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనాన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిరసనలు వ్యక్తం చేయడాన్ని కూడా సహించలేని పరిస్థితుల్లో ప్రభుత్వ వర్గాలు ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు క్లాక్‌టవర్ సెంటర్‌లో ఆందోళనకు దిగారు. నల్ల జెండాలు, బ్యాడ్జీలతో ర్యాలీ తీసి, రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడానికి సిద్ధం కాగా, పోలీసులు వచ్చి దిష్టిబొమ్మను లాక్కుపోయేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. దాంతో పోలీసులు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తోపులాట, వాగ్వివాదం జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. అయినా బీఆర్ఎస్ నేతలు దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అనైతికమని, ప్రభుత్వ కుట్రపూరిత చర్యలను ప్రజల్లో ఎండగడతామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. హాలియాలో బీఆర్ఎస్ నేతలు ర్యాలీ తీసి, సాగర్ క్రాస్‌రోడ్స్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సూర్యాపేట జిల్లాలో...

సూర్యాపేట జిల్లా కేంద్రంలో జగదీశ్‌రెడ్డి సస్పెన్సన్‌పై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందించారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ నేతలు, కార్యకర్తలంతా రోడ్లపైకి వచ్చారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడంలో ముందుండే జగదీశ్‌రెడ్డిపై సభ నుంచి సస్పెన్షన్ అనేది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్‌రావు అన్నారు. జగదీశ్‌రెడ్డి స్వగ్రామం నాగారం మండలం కేంద్రంలోనూ బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అర్వపల్లి, తుంగతుర్తి మండల కేంద్రంలోనూ బీఆర్ఎస్ నేతలంతా రోడ్లపైకి వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఊరేగించి, దహనం చేశారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోనూ బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

నేడూ ఆందోళనలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సస్పెన్సన్‌పై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం రాష్ట్రమంతా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం సాయంత్రం నుంచే పలుచోట్ల నిరసనలకు దిగారు. మిగతా నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తే సభ నుంచి సస్పెండ్ చేస్తారా? అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తూ నేడు ఉమ్మడి జిల్లా అంతటా ర్యాలీలు, రాస్తారోకోలు, ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనాలకు సిద్ధమయ్యారు.

మోత్కూరులో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

'అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం అప్రజాస్వామికం. జగదీశ్‌రెడ్డి గొంతు నొక్కి ఏదో సాధిస్తాం అనుకుంటే అది ప్రభుత్వం పిచ్చి ఆలోచన అవుతుంది. కాంగ్రెస్ సర్కారు తీరును ప్రజలు గమనిస్తున్నారని గుర్తుంచుకోవాలి.'

- రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

ప్రజాసమస్యలపై నిలదీస్తే సస్పెండ్ చేస్తారా?

రైతులు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో నిలదీయడం మింగుడుపడని కాంగ్రెస్ సర్కార్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సస్పెండ్ చేయడం హేయమైన చర్య. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించే హక్కు లేదా? చట్టసభల్లో ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలకు పాలకపక్షం బాధ్యత సమాధానం చెప్పాల్సిందిపోయి నిరంకుశంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు సరికాదు.

-కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

సస్పెన్షన్‌తో గొంతు నొక్కలేరు.. మరింత బలంగా ప్రజల వాణి వినిపిస్తా

''ఇన్నేండ్లు సభ్యుడిగా ఉన్న నేను శాసనసభలో ఒక్క రోజు కూడా అన్‌పార్లమెంటరీ పదం వాడలేదు. ఇతరులను కించపరిచే విధంగా గానీ, సభ గౌరవాన్ని తగ్గించే విధంగా గానీ మాట్లాడలేదు. ప్రత్యేకించి స్పీకర్ అధికారాలు, విధులుతెలిసిన సభ్యుడిగా ఎక్కడా స్పీకర్ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించలేదు. ఇది కేవలం ప్రభుత్వం చేసిన కుట్ర. రాష్ట్రంలో ఎండిపోతున్న పంటలు, రైతుల వేతల గురించి, వివిధ వర్గాల ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశాను. ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యత మాపై ఉంది. ప్రజలు చాలా ఆక్రోషంగా ఉన్నారు. నా ప్రసంగంలో ఎక్కడా ఒక్క మాట కూడా తప్పుగా మాట్లాడలేదు. స్పీకర్‌ను కించపరిచే మాట లేదు. ఈ సభ అందరిదీ. అందరికీ సమాన హక్కులు ఉంటాయి. ఈ సభ పెద్దగా మీకు ఆ బాధ్యత ఉంది. మమ్మల్ని మాత్రమే అనొద్దు. అవతలి వాళ్ల(అధికార పక్షం)ను కూడా కంట్రోల్ చేయాలని కోరాను. అయినా కుట్రలతో సస్పెన్షన్ విధించారు. దళితుల పట్ల కమిట్‌మెంట్ గురించి మాట్లాడాల్సి వస్తే... నా సూర్యాపేట మున్సిపాలిటీ జనరల్ స్థానంలో ఎస్సీ మహిళకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పిస్తే అద్భుతంగా పని చేశారు. నాలుగేండ్ల తర్వాత ఆ దళిత చైర్‌పర్సన్‌ను దించేందుకు కాంగ్రెస్ వాళ్లు చేసిన కుట్రలను తిప్పికొడుతూ ఆమె పదవిని నిలబెట్టాను. దళితుల పట్ల నా నిబద్ధత అది. ఇవ్వాల ఈ ప్రభుత్వం తాను చేసే తప్పును కప్పిపుచ్చుకునేందుకు, కమీషన్ల దందాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మొదటి రోజే సభలో ఏదో ఒకటి చేయాలని ఉద్దేశపూర్వకంగా వ్యవహరించింది. అందులో భాగమే నా సస్సన్సెన్. సస్పెన్షన్‌తో నన్ను భయపెట్టించలేరు. కేసీఆర్ నాయకత్వంలో రాటుదేలి ఇక్కడి దాకా వచ్చిన. ఇంతకంటే ఎక్కువ దుర్మార్గాలు ఎదుర్కొని వచ్చిన వాణ్ని. నా గొంతు నొక్కలేరు. ఇంకా బలంగా, ప్రజల పక్షాన నా గొంతు వినిపిస్తా'

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజ్యాంగ విరుద్ధం

కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ప్రజా సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని కుట్రపూరితంగా అసెంబ్లీ బడ్జెట్ సెషన్స్ సస్పెండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని రైతు బజార్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీసి నిరసన తెలుపుతాం. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్దసంఖ్యలో వచ్చి సర్కారు తీరును ఎండగట్టాలి. **- నల్లమోతు భాస్కర్‌రావు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే**



నల్లగొండలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

- సేవా కార్యక్రమాలతో శుభాకాంక్షలు

నల్లగొండ, మార్చి 13 : జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని వీటీ కాలనీలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మహిళా కళాశాలలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన ఆధ్వర్యంలో విద్యార్థినులు సంబురాలు జరిపారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో బీఆర్ఎస్ కార్యకర్తలు రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఐసీడీఎస్ మాజీ ఆర్వో మాలె శరణ్యారెడ్డి హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నకిరేకల్, చింతపల్లి మండలం గొడకొండ్ల, భూదాన్‌పోచంపల్లి, తుర్కపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. భువనగిరిలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సాయిబాబా ఆలయంలో జాగృతి నాయకులు పూజలు చేసి, అన్నదానం చేశారు. కోదాడలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎస్‌కే నయీమ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దగ్గర వద్ద బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు.

నర్సింహకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కాంగ్రెస్ నాయకుడు బీఆర్ఎస్‌లో చేరిక

కట్టంగూర్, మార్చి 13 : మండలంలోని గార్లబాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పర్వతం నర్సింహ ఆ పార్టీకి రాజీనామా చేసి గురువారం కట్టంగూర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా నర్సింహకు మాజీ ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది బాలనర్సయ్య, రెడ్డిపల్లి మనోహర్, వడ్డె సైదిరెడ్డి, బోడ యాదగిరి, ఒంగూరి సైదులు, గుండగోని రాములు, పర్వతం మత్స్యగిరి, పోగుల నర్సింహ పాల్గొన్నారు.

శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామ పంచాయతీ పరిధిలో జోలంవారిగూడేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు గురువారం రాత్రి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మాజీ మండలాధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

మల్లాపురంలో నార్ముల్ పాల సేకరణ కేంద్రం వద్ద క్యాన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

పాల బిల్లులు ఎగ్గొడుతరా?

- నార్ముల్ సంస్థపై పాడి రైతుల ఆగ్రహం
- మల్లాపురంలో పాల క్యాన్లతో నిసరన

యాదగిరిగుట్ట, మార్చి 13 : నాలుగు నెలలుగా పాల బిల్లులు ఇవ్వడం లేదు.. ఎగ్గొడుదామని చూస్తున్నారా అంటూ నార్ముల్ సంస్థపై పాడి రైతులు మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం మండలంలోని మల్లాపురంలో గల నార్ముల్ పాల సేకరణ కేంద్రం వద్ద గురువారం పాల క్యాన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ ఒగ్గు భిక్షపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య మాట్లాడుతూ సాగునీరు లేక, సరిగ్గా కరెంటు రాక పంటలు ఎండిన రైతులు పాల బిల్లు అయినా ఆసరా అవుతుందని భావిస్తే నిరాశే మిగిలిందన్నారు. గతేడాది మదర్ డెయిరీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం నుంచి రూ.30 కోట్ల గ్రాంట్, లీటర్ పాలకు రూ.5 బోనస్, నెల నెలా ఒకటో తేదీన బిల్లులు చెల్లించేలా కృషి చేస్తామని చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మల్లాపురంలో 27 మంది పాడి రైతులకు రూ.5 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉన్నాయని తెలిపారు. పాలక వర్గం స్పందించి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండం సత్తయ్యగౌడ్, పారుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల నాగరాజు, మన్నెపు శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల సాదు, పల్లెపాటి శేఖర్, శిఖ ఉపేందర్‌గౌడ్, కళ్లెం రాజుగౌడ్, శిఖ నర్సింహులు, కర్రె చంద్రశేఖర్, ఎండీ ఇమ్రాన్, ఒగ్గు భిక్షపతి, శివప్రసాద్, సంపత్ పాల్గొన్నారు.

సూర్యాపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆందోళన

సూర్యాపేటలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సూర్యాపేట టౌన్, మార్చి 13 : పెండింగ్ స్కాలర్‌షిప్‌తోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. నుంచి భారీ ర్యాలీగా వచ్చి కర్నల్ సంతోష్‌బాబు చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యా రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ పెండింగ్ పెట్టడంతో కళాశాలల యాజామాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నాయని తెలిపారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల అద్దె భవనాల్లో సమస్యల కూపంగా మారాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇప్పటివరకూ విద్యా శాఖకు మంత్రి లేరని, ముఖ్యమంత్రి దగ్గరే ఆ శాఖ ఉన్నా సమస్యలు పరిష్కరం కాకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి వినయ్, దీపక్, నాని, వీరబాబు, అజయ్, గోపి, మేఘన, నవ్య, జ్యోతి, కావ్య పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి

రాజాపేట, మార్చి 13 : మండలంలోని సింగారం గ్రామంలో గురువారం వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి చెందినది. గ్రామానికి చెందిన బొల్లారం నరసమ్మ ఉపాధి హామీ పనికి వెళ్లి 11 గంటల సమయంలో ఇంటికొచ్చి ఎండకు తాళలేక అస్వస్థతకు గురైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రాజాపేట దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

SI&PC | RRB (GROUP-D/NTPC)
ఫ్రీ మోడల్ టెస్ట్ మార్చి 16 ఆదివారం ఉ॥10 గం॥లకు
100% జాబ్ ఓరియెంటెడ్ నెం.1 కోచింగ్
బ్యాచ్‌లు ప్రారంభం | అడ్మిషన్లకు సంప్రదించండి | హాస్టల్ వసతి కలదు
SLICE2 కోచింగ్ సెంటర్
LPT మార్కెట్, Hyd రోడ్, తిరుమల టాకీస్ ప్రక్కన, నల్లగొండ
9491618604, 7989568604, 9676688651

వడపర్తి.. దాహార్తి

15 రోజులకోసారి నీటి సరఫరా

పదిహేను రోజులకోసారి నీటి సరఫరా.. కిలోమీటర్ల దూరం నుంచి బిందెల్లో నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు.. ప్రైవేట్‌లో డబ్బులు వెచ్చించి ట్యాంకర్ నీళ్ల కొనుగోలు.. ఇదీ భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో పరిస్థితి. ఎండకాలానికి ముందే నీటి తిప్పలు తప్పని దుస్థితి. అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు గోడును వెల్లబోసుకుంటున్నారు.

- యాదాద్రి భువనగిరి, మార్చి 13 (నమస్తే తెలంగాణ)

ఊరికి దూరంగా ఉన్న పొలం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న వడపర్తి గ్రామస్తులు

- కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్లే దిక్కు
- బిందెలు, క్యాన్లలో తెచ్చుకుంటున్న దుస్థితి
- ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు
- ఒక్కో ట్యాంకర్‌కు వెయ్యి రూపాయలు
- వాటర్ ఫిల్టర్ వేస్టేజ్ నీళ్లు వాడితే దద్దుర్లు
- పట్టించుకుని సమస్యను పరిష్కరించే వారు కరువు

భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో సుమారు 1,300 కుటుంబాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎండ కాలంలోనూ ఇక్కడ ఎన్నడూ నీటి కష్టాలు లేవు. మిషన్ భగీరథతో ఇంటింటికీ నీళ్లు అందాయి. కానీ ప్రస్తుతం వేసవికి ముందే నీటి కష్టాలు మొదలయ్యాయి. సంక్రాంతి వరకు నీటి సరఫరా బాగానే ఉన్నా.. ఇప్పుడు 15 రోజులకోసారి గానీ రావడం లేదు. అదీ ఒక్కటి, రెండు రింగులకు మించి ఇవ్వడం లేదు. ఊళ్లో ఏ ఇంట్లో చూసినా ఖాళీ సంపులే కనిపిస్తున్నాయి. మిషన్ భగీరథ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మెయిన్ వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మార్చారు. మినీ ట్యాంకులు సైతం నీళ్లు లేక ఎండిపోయాయి. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం రోజురోజుకూ సమస్య జటిలమవుతున్నది.

పొలాల నుంచి..

ఇంట్లో నీళ్లు లేనిదే ఏ పనీ జరుగదు. గృహ అవసరాలను అటుంచితే తాగునీటికి కూడా దిక్కులేదు. దాంతో గ్రామానికి కిలో మీటర్ల దూరంలో ఉన్న పొలాల వద్దకు బిందెలు, క్యాన్లతో వెళ్లి ప్రజలు నీళ్లు తెచ్చుకుంటున్నారు. మహిళలు బావులు, బోర్ల దగ్గరికే వెళ్లి బట్టలు ఉతుకుతున్నారు. వృద్ధులు సైతం నడుచుకుంటూ వెళ్లి నీళ్లు మోసుకొచ్చుకుంటున్నారు. భూగర్భజలాలు అడుగుంటుతున్న నేపథ్యంతో పంటలకు నీళ్లు సరిపోవడం లేదని రైతులు కూడా బోర్ల వద్దకు రావద్దంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. దాంతో కొందరు వాటర్ ఫిల్టర్ వేస్టేజీ వాటర్‌ను తెచ్చుకొని వాడుకుంటున్నారు. చిన్న పిల్లలకు ఆ నీటితో స్నానం చేయిస్తే దురద వస్తున్నదని చెప్తున్నారు.

ప్రైవేట్ ట్యాంకర్లతో..

నీటి సరఫరా లేకపోవడంతో కొందరు గ్రామస్తులు ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. రెండు, మూడు కుటుంబాలు కలిసి ఒక ట్యాంకర్ తెప్పించుకుంటున్నాయి. ఇంట్లో ఉన్న సంపులను నింపుకొని నాలుగైదు రోజులు వాడుకుంటున్నాయి. ఒక్కో ట్యాంకర్ వెయ్యి రూపాయలు వెచ్చిస్తున్నారు. నీటి సమస్యపై స్థానిక అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని, నీళ్లు రాకపోతే మేమేం చేస్తామంటూ నిర్లక్ష్యంగా బదులిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

మళ్లీ ఓట్లని వస్తే బిందెలతో కొడ్తం..

ఇంటి ముందు సాంపి చల్లడానికి గూడ నీళ్లు లేవు. లీడర్లు ఓట్లప్పుడు బానే వస్తరు. ఇప్పుడు ఎందుకొస్త లేరు? మళ్లీ ఓట్లని వస్తే బిందెలతో కొడ్తం. బాయికాడికి పోతే రైతులు అడ్డుకుంటున్నరు. ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవాలి. మా సమస్యను పరిష్కరించాలి.

- కె.నిర్మల, గృహిణి

బీఆర్ఎస్ టైమ్‌లో నీళ్లకు ఇబ్బంది లేదు

బీఆర్ఎస్ టైమ్‌లో నీళ్లకు ఇబ్బంది లేదు. ఇప్పుడు ఊళ్లో నీళ్లే వస్తలేవు. బాయిల కాడికి వెళ్లి బట్టలు ఉతుక్కుంటున్నాం. పొలాల రైతులేమో రావద్దని తిడుతున్నరు. చేసేది లేక ప్రైవేట్ ట్యాంకర్‌ను తెప్పించుకుంటున్నం. ఒక్కో ట్యాంకర్‌కు వెయ్యి రూపాయలు అవుతున్నాయి. ఇట్ల ఎన్ని రోజులు తెప్పించుకోవాలి?

- జూపల్లి లక్ష్మి, గృహిణి, వడపర్తి